
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 3 డిసెంబరు 2025

రాగట్లపల్లి పాలకవర్గ ఏకగ్రీవానికి తీర్మానం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ పాలక వర్గం ఎన్నికకు గ్రామస్థులు మంగళవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. అధికారులు సర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాయించారు. గ్రామంలో మొత్తం 353 మంది ఓటర్లున్నారు. గ్రామస్థులు సమావేశమై ఎన్నికలకు పోటీ లేకుండా సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు ఆరు వార్డు సభ్యులను ఏకగ్రీవం చేసేందుకు ముందుకువచ్చారు. సర్పంచ్‌గా నెత్తెట్ల లస్మయ్య, ఉపసర్పంచ్‌గా మందాటి రాము, వార్డు సభ్యుల ఎన్నికకు తీర్మానించారు. గ్రామంలో ఎవరూ నామినేషన్లు దాఖలు చేయకూడదని నిర్ణయించారు.

ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు..

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్‌పై తహసీల్దార్లు, ఎంపీవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ట్రైనర్‌లు పీపీటీతో శిక్షణఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉంటుందని తెలిపారు. వారికి సంబంధిత అప్లికేషన్లు ఎంపీడీవో కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని, వాటిని ఎస్‌ఈసీ నిబంధనల ప్రకారం నింపి అందజేయాలని సూచించారు. శిక్షణలో శిక్షణ నోడల్ అధికారి శేషాద్రి, పోస్టల్ బ్యాలెట్ నోడల్‌అధికారి లక్ష్మీరాజం, ట్రైనర్ పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ రజిత

వేములవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మేంట్ యాక్ట్ ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులో తనిఖీ చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల పనితీరు సీఈఏ యాక్ట్ ప్రకారం నిబంధనలను అనుసరించి డాక్టర్ల పేర్లు, ఆసుపత్రిలో పనిచేసే స్టాఫ్ వివరాల నమోదును సమీక్షించి, ధరల వివరాలు నిబంధన అనుసరించి ఆసుపత్రికి సంబంధించిన ఫైర్ సేఫ్టీ, రిజిస్ట్రేషన్, వేస్ట్ మేనేజ్మెంట్ సర్టిఫికెట్ల తీరును తనఖీ చేశారు. వ్యాధిగ్రస్తులకు వసతి సౌకర్యాలపై, మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులను హెచ్చరించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ అనుమతి లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంట ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సంపత్ కుమార్, మహేష్ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి వైపు ప్రజల చూపు..

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

తంగళ్లపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి వైపు చూస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. తంగళ్లపల్లి మండలం చింతల్‌ఠాణ గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియార్ నాయకుడు గుర్రం సత్తయ్య బీజేపీలో చేరాడు. మంగళవారం చింతల్‌ఠాణ గ్రామానికి వెళ్లిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ అత్యధిక గ్రామపంచాయతీల్లో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులతో పాటు కేంద్ర మంత్రి బండి సంజయ్ చేస్తున్న అభివృద్ధి పనులతో చాలామంది పార్టీ వైపు చూస్తున్నరన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు తదితరులు ఉన్నారు.

ముగిసిన రెండో విడత నామినేషన్లు

- చివరి రోజు సర్పంచ్‌కు 200, వార్డులకు 865

సిరిసిల్ల డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయితీ ఎన్నికల్లో రెండో విడత నామినేషన్లకు తెరపడింది. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో చివరి రోజు రాత్రి 10 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. రెండో విడతలో బోయిన్‌పల్లి, తంగళ్ళపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో 88 సర్పంచులు, 758 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు స్వీకరించారు. మంగళవారం చివరి రోజు 200సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు రాగా 865 వార్డులకు స్థానాలకు నామినేషన్లు వచ్చాయి. ఇల్లంతకుంటలో 90 సర్పంచ్‌లకు, 375 వార్డు, తంగళ్లపల్లిలో 110 సర్పంచ్‌లకు, 490 వార్డు నామినేషన్లు వచ్చాయి. రెండో విడతకు నామినేషన్ల పర్వంలో మొత్తం సర్పంచ్ స్థానాలకు, వార్డు నామినేషన్లు వచ్చాయి. తంగళ్ళపల్లి మండలం బాలమల్లుపల్లెలో సర్పంచ్‌గా యాద ఎల్లయ్య, వేణుగోపాల్‌పూర్ సర్పంచ్‌గా జూపల్లి రమాదేవితో పాటు, వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. ఇల్లంతకుంట మండలం చిక్కువానిపల్లె కళ్యాణ్, తిప్పాపూర్ సర్పంచిగా బొల్లవేణి మంజుల, వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. కేశన్నపల్లెలో సర్పంచ్ పోతరాజు చంటి ఏకగ్రీవం కాగా ఆరు వార్డులో ఏకగ్రీవమయ్యాయి. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

తుది విడతకు రంగం సిద్ధం



- నేడు 87 సర్పంచ్‌లు, 762 వార్డులకు నోటిఫికేషన్
- 5వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ..
- 6న పరిశీలన.. 9న ఉపసంహరణ.. 17న పోలింగ్
- నాలుగు మండలల్లో 29 నామినేషన్ స్వీకరణ కేంద్రాలు
- తుది విడతలో 127920 మంది ఓటర్లు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పల్లె పంచాయతీల తుది విడత నామినేషన్లకు రంగం సిద్ధమైంది. జిల్లాలో 12 మండలాల్లో 260 గ్రామ సర్పంచ్‌లు, 2268 వార్డులకు సంబంధించిన ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఇప్పటికి మొదటి విడతలో 80 సర్పంచ్‌లు, 722 వార్డులకు నామినేషన్ల ప్రక్రియ బుధవారం పూర్తి అవుతుంది. ఈనెల 11న పోలింగ్‌కు సిద్ధం చేస్తున్నారు. రెండవ విడతలో 88 సర్పంచ్ స్థానాలకు, 758 వార్డులకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ పూర్తి చేశారు. ఈనెల 3న పరిశీలన, 6 వరకు ఉప సంహరణలకు అవకాశం ఉంది. పోలింగ్ 14 నిర్వహిస్తారు.

తుది విడత మంగళవారం ఈనెల 3 నుంచి నోటిఫికేషన్ జారీచేసి నామినేషన్లు స్వీకరిస్తారు. తుది విడతలో 87 గ్రామపంచాయతీలు, 762 వార్డులున్నాయి.ఎల్లారెడ్డిపేటలో 26 సర్పంచ్‌లు, 226 వార్డులు ఉండగా, వీర్నపల్లిలో 17 సర్పం చ్‌లు, 132 వార్డులు ఉండగా, గంభీరావుపేటలో 22 సర్పంచ్‌లు, 202 వార్డులు, ముస్తాబాద్‌లో 22 సర్పంచ్‌లు, 202 వార్డులకు సంబంధించి 5వ తేది వరకు నామినేషన్లు స్వీకరించి, 6న పరిశీలన, 9 వరకు ఉపసంహరణలు, 17న పోలింగ్ నిర్వహించనున్నారు.

రిజర్వేషన్లు ఇవీ..

తుది విడతలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లోని 87 సర్పంచ్‌లకు, 762 వార్డులకు ఎన్నికల రిజర్వేషన్లు ఇప్పటికే ఖరారు చేశారు. ఇందులో సర్పంచ్ స్థానాల్లో మహిళలు 39, జనరల్ 48 స్థానాలు ఉన్నాయి. వార్డుల్లో మహిళలు 330, జనరల్ 432 స్థానాలు రిజర్వు అయ్యాయి. ఎల్లారెడ్డిపేటలో మహిళలు 12, జనరల్ 14 స్థానాలు ఉండగా, వార్డుల్లో మహిళలు 98, జనరల్ 128 స్థానాలు ఉన్నాయి.

వీర్నపల్లిలో మహిళలు 8, జనరల్ 9 స్థానాలు ఉండగా, వార్డుల్లో మహిళలు 60, జనరల్ 72 స్థానాలు, ముస్తాబాద్‌లో మహిళలు 9, జనరల్ 13 స్థానాలు ఉండగా, వార్డుల్లో

మిగతా 8వ పేజీలో..

తుది విడతలో గ్రామపంచాయతీ ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
ఎల్లారెడ్డిపేట	19690	21196	40886
వీర్నపల్లి	5769	5958	11727
ముస్తాబాద్	18658	19842	38500
గంభీరావుపేట	17811	18996	36807
మొత్తం	61928	65992	127920

తుది విడత సర్పంచ్ స్థానాలు

మండలం	మొత్తం	ఎస్టీ	ఎస్సీ	బీసీ	జనరల్
ఎల్లారెడ్డిపేట	26	4	5	5	12
వీర్నపల్లి	17	8	3	0	6
ముస్తాబాద్	22	1	5	5	11
గంభీరావుపేట	22	3	4	5	10
మొత్తం	87	16	17	15	39

తుది విడత వార్డుల్లో స్థానాలు

మండలం	మొత్తం	ఎస్టీ	ఎస్సీ	బీసీ	జనరల్
ఎల్లారెడ్డిపేట	226	32	40	52	102
వీర్నపల్లి	132	66	14	09	43
ముస్తాబాద్	202	10	44	47	101
గంభీరావుపేట	202	23	36	52	91
మొత్తం	762	131	134	160	337

అభ్యర్థుల విజయానికి సమష్టి కృషి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు పంచాయతీ పోరు అభ్యర్థుల విజయం సాధించేలా సమష్టిగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో ఇద్దరు, ముగ్గురు కాకుండా ఐక్యతతో బరిలో ఒక్కరినే నిలపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. అన్ని స్థానాల్లో కాంగ్రెస్ మద్ధతుదారుల గెలుపునకు శ్రమించాలన్నారు. ఆయా గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సమావేశంలో ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, వైస్‌చైర్మన్ రాంరెడ్డి, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ అభ్యర్థి భర్తపై దాడిని ఖండిస్తున్నాం

గంభీరావుపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెం సర్పంచ్ అభ్యర్థి భర్త మామిడి యాదగిరి యాదవ్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నామని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు దేవేందర్ యాదవ్ పేర్కొన్నారు. గంభీరావుపేటలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సంఘటన జరిగిన వెంటనే యాదగిరి యాదవ్‌ను పరామర్శించాన్నారు. ప్రజాస్వామ్యంగా జరిగే ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులపై దాడులు చేయడం, బెదిరింపులకు పాల్పడటం సమంజసమం కాదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ ఉన్నతాధికారులు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా యాదవులు ఆందోళలకు దిగాల్సి వస్తుందని దేవేందర్ యాదవ్ హెచ్చరించారు.

ఉన్నత స్థానాలకు ఎదగాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్

బోయినపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. బోయినపల్లి మోడల్ స్కూల్‌లో మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు, విద్యాలయం ఆవరణ, మధ్యాహ్న భోజనం మెనూ, తయారీని పరిశీలించారు. మెనూ ప్రకారం ఏ ఆహారపదార్థాలను సిద్ధం చేస్తున్నారో అడిగి తెలుసుకు న్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. తరగతి గదిలో ఇంగ్లీష్ పాఠం కొనసాగుతుండగా పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రతి రోజూ స్కూల్‌కు రావాలని విద్యార్థులకు సూచించారు. సిలబస్ ఫిబ్రవరిలో పూర్తి చేయాలని, వార్షిక పరీక్షలకు సాధన చేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులందరూ అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని, ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాట్లాడేలా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పాలిస్టర్ వస్త్రానికి కూలి పెంచాలి



వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో తయారు చేసే పాలిస్టర్ వస్త్రానికి కూలిని 15 రోజుల్లో పెంచాలని లేకుంటే సమ్మెకు వెళతామని సీఐటీయూ పవర్ లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని పాలిస్టర్ అసోసియేషన్ సంఘ భవనంలో మంగళవారం అధ్యక్ష, కార్యదర్శులు అడెపు భాస్కర్, అంకారపు రవిలకు కార్మికులతో కలిసి కూలి పెంచాలంటూ వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పాలిస్టర్ వస్త్రాన్ని తయారుచేస్తున్న మరమగ్గాల కార్మికులు, ఆసాములు, వార్పిన్, వైపని అనుబంధ రంగాల కార్మికులకు 15 రోజుల్లో కూలి పెంచాలని లేకుంటే సమ్మె చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నక్క దేవదాస్, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, ఉడుత రవి, వైపని వర్కర్స్ యూనియన్ నాయకులు ఎలిగేటి శ్రీనివాస్, గడ్డం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, షీటీం సభ్యులు

ముస్తాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని షీటీం ఏఎస్ఐ ప్రమీల పేర్కొన్నారు. మండలంలోని నామాపూర్ గ్రామంలోగల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జిల్లా షీటీమ్ అధికారులు అవగాహన కల్పించారు. షీ టీం ప్రతిరోజు విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాలను సందర్శిస్తూ గుడ్‌టచ్ బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్ టీచింగ్ పోక్సో చట్టం,షీటీం సేవలు, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఎవరైనా వేధింపులకు గురైతే నిర్భయంగా షీటీం నంబర్ 8712656425కి ఫోన్‌చేయాలన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుల వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. షోషల్ మీడియలో అపరిచితుల వ్యక్తుల పట్ల స్పందించ వద్దన్నారు. ఈకార్యక్రమంలో షీటీం అధికారులు వీరయ్య, సిబ్బంది శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతను చదివి ఆత్మశుద్ధి చేసుకోవాలి

- సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటేశ్వర్లు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీతను చదివి అర్థం చేసుకొని ఆత్మశుద్ధిని చేసుకోవాలని సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గీతనగర్ శ్రీ సద్గురు మలయాళ గీత ఆశ్రమంలో సిరిసిల్ల గీత ప్రచార సేవా సమితి ఆధ్వర్యంలో గీత జ్ఞాన యజ్ఞం ప్రవచనాల ముగింపు సమావేశం సేవా సమితి అధ్యక్షుడు కోడం నారాయణ అధ్యక్షతను జరిగింది. ముఖ్య అతిథి ఆర్డీవో, సేవా సమితి సభ్యులు వారం రోజులుగా ప్రవచనాలు చేసిన బ్రహ్మచారి శ్రీఅక్షయ చైతన్య స్వామీజీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆర్డీవో మాట్లాడారు. భక్తులకు గత వారం రోజులుగా స్వామిజీ చక్కని సందేశాత్మకమైన ప్రవచనాలు చేశారని అన్నారు. భగవద్గీత మనిషి ముక్తికి సాధనమని మనిషి మార్పునకు సాధనమన్నారు. అంతకుముందు భగవద్గీతపై నిర్వహించిన పోటీలలో విజేతలకు ఆర్డీవో బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల గీత ప్రచార సమితి ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య, సభ్యులు, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసులతో సయోధ్య



- ఉపసంహరణకు నజరానాలు
- పార్టీల మద్దతుకు అభ్యర్థుల ఆరాటం
- నేటితో తొలివిడత నామినేషన్ల ఉపసంహరణ
- జిల్లాలో ఆసక్తికరంగా పంచాయతీ రాజకీయం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పంచాయతీ ఎన్నికల రాజకీయం కాసుల చుట్టూ తిరుగుతోంది. జిల్లాలో ఏకగ్రీవం కోసం అభ్యర్థులు కాసులే ఆయుధంగా ముందు నిలిపారు. జిల్లాలో తొలి విడత నామినేషన్ల ప్రక్రియ పూర్తికాగా బుధవారం ఉపసంహరణ గడువు ముగుస్తుంది. మొదటి విడతలో 85 సర్పంచ్, 748 వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో మూడు గ్రామపంచాయతీలు పూర్తిగా, సర్పంచ్, మరికొన్ని వార్డుస్థానాలు ఏకగ్రీవమయ్యాయి. తొలి విడతలో సర్పంచ్‌లకు 385మంది అభ్యర్థులు, వార్డులకు 1624 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. రెండో విడత నామినేషన్ల ప్రక్రియ బుధవారం ముస్తుంది. ఇదే రోజు తుది విడత నామినేషన్లు స్వీకరించడానికి ఏర్పాట్లు చేశారు. రెండేళ్ల విరామం తర్వాత వచ్చిన పంచాయతీ పదవులు దక్కించుకోవడానికి సర్వశక్తులు అభ్యర్థులు ఒడ్డుతున్నారు. పోటీలో ఉండి నానా ఇబ్బందులు పడే బదులు ప్రత్యర్థులను ఉపసంహరించుకోనే విధంగా చేసుకొని ఏకగ్రీవం కావడం కోసం అన్ని ప్రలోభాలకు సిద్ధంఅయ్యారు.

పవర్ లీడర్ల హవా

పంచాయతీ ఎన్నికల్లో పార్టీల ప్రమేయం కంటే గ్రామంలో పలుకుబడి లీడర్ల హవా కొనసాగుతోంది. గ్రామాల్లో సుదీర్ఘకాలంగా పట్టు కలిగిన పవర్ లీడర్లు అభ్యర్థుల జయాపజయాల నిర్ణయాత్మక శక్తి తమదేనంటూ ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో పోటీకి సిద్ధపడ్డ అభ్యర్థులు వారిని కూడా ప్రసన్నం చేసుకుంటున్నారు. భారీగా నజరానాలు చెల్లించుకున్నట్లు తెలుస్తోంది. పోటీలో ఉండే అభ్యర్థులు ఎవరిని విస్మరించవద్దనే భావనతో గ్రామ పెద్దల మాటలను విస్మరించడం లేదు. మరోవైపు పవర్ లీడర్లు కూడా ఇదే మంచి అవకాశంగా భావిస్తున్నారు. అభ్యర్థులను తిప్పలు పెడుతూ కాసులు పిండుకుంటున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అభ్యర్థులను ఖర్చులకు గురిచేస్తూ ఉండడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్న సందర్భాలు ఉన్నాయి.

నజరానాలు... బుజ్జగింపులు

జిల్లాలో 260 సర్పంచులు, 2268 వార్డులు ఉన్నాయి. ఇప్పటికే కొన్ని సర్పంచులు, వార్డు స్థానాలు ఏకగ్రీవం కావడంతో వారి బాటలోనే మిగతావారు ఏకగ్రీవ ప్రయత్నాలు ముమ్మ రం చేశారు. గ్రామ పెద్దల సహకారంతో నామినేషన్లు వేసిన అభ్యర్థుల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. గ్రామ అభివృద్ధి పేరిట పోటీ నుంచి తప్పించుకునే విధంగా బుజ్జ గిస్తున్నారు. పదవుల కాంక్షతో ఉన్నవారు రూ 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు నజరానాలు ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో దేవస్థానాల నిర్మాణా లు, కమ్యూనిటీ భవనాలు, ఇతర సౌకర్యాలు కల్పించడానికి నిధులను ఇస్తామని ప్రకటనలు చేశారు. మరికొందరు నేరుగా తనతో పాటు నామినేషన్లు వేసిన వారికే ఎంతో కొంత ఇచ్చి తప్పుకునే విధంగా మంతనాలు జరుపుతు న్నారు. మరోవైపు ఓటు బ్యాంకు ఉండి గెలిచే అవకాశం ఉన్నవారు కుల సంఘాలు, యువజన, మహిళా సంఘాల మద్దతును కూడ గట్టుకోవడానికి అందుకు ప్రతిఫలంగా ఆర్థిక తోడ్పాటు హామీలు ఇస్తున్నారు. మరికొందరు గ్రామ ప్రజలకు నేరుగా ఉచితాలు ప్రకటిస్తున్నారు. 2009 ఎన్నికల్లో 41 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా, ఈసారి కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది.

ఆటో, స్కూటీ ఢీ..

● ముగ్గురికి తీవ్ర గాయాలు



ఢీకొన్న ఆటో, స్కూటీ

వేములవాడ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని రెండోబైపాస్ రోడ్డులోగల దోబీఘాట్ వద్ద మంగళవారం ఆటో, స్కూటీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ఆటోడ్రైవర్ భరత్‌కు, మరో ప్రయాణికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్కూటీపై వెళ్తున్న అర్చకుడు ప్రసన్న కాలు విరిగింది. క్షత గాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

ఇసుక లారీని ఢీకొన్న యువకుడు

● తీవ్ర గాయాలు

వీణవంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామంలో ఇసుక లారీని ఢీకొని గూడిపాటి రాంరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం ధర్మారం గ్రామానికి చెందిన రాంరెడ్డి ద్విచక్ర వాహనంపై చల్లూరు నుంచి మామిడాలపల్లికి వెళ్తుండగా పార్కింగ్ సిగ్నల్స్ లేకుండా రోడ్డుమీద నిలిపిన ఇసుక లారీని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ రాంరెడ్డిని స్థానికులు వెంటనే 108లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. రాంరెడ్డి సోదరి కాసర్ల ప్రత్యూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

వరి కొయ్యలు కాలిస్తే ముప్పే..



వేములవాడ పట్టణం నాంపల్లిలో వరికొయ్యలకు నిప్పుపెట్టిన రైతు

- భూసారం కోల్పోయి తగ్గనున్న దిగుబడి..
- కలియ దున్నితే పోషక పదార్థాల శాతం పెంపు
- సూచనలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు

వేములవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులు వరిపంటను సేకరించిన తరువాత వరి కొయ్యలను కాల్చుతే వచ్చే దిగుబడులపై ముప్పు వాటిల్లనుంది. వరి కొయ్యలను (కొయ్యకాలు) కల్చాతే నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని, కాల్చడంతో విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుందనే విషయాన్ని రైతులకు గుర్తుంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం చెబుతున్నాడు. వేములవాడ డివిజన్ పరిధిలో రైతులు పంట సేకరించిన తరువాత కొయ్యలను నిప్పంటించి తగలబెడుతున్నారు. గతంలో వంటను కొడవళ్ల సహాయంతో మొదళ్ల వరకు కోసేవారు. పశువులు ఎక్కువగా గ్రామాల్లో ఉండటంతో కొయ్యలను కింది వరకు కట్ చేసి గడ్డివాములు వేస్తూ వరి గడ్డిని నిలువ చేశేవారు. ప్రస్తుతం సాగు విధానంలో మార్పులు రావడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. మిషన్‌తో వరి పంటను కట్ చేయడంతో కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. దీంతో పొలం సాగు సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయనే ఉద్దేశ్యంతో ఎక్కువ శాతం రైతులు కొయ్యలను తగలబెడుతున్నారు. వరికొయ్యలను తగలబెడితే అధిక నష్టాలు వచ్చే అవకాశముందని, రైతులు వ్యవసాయాధికారుల సూచనలు,సలహాలు పాటించాలని సూచిస్తున్నారు.

● అధిక ఉష్ణోగ్రతతో సారాన్ని కోల్పోతుంది..

పంట పొలంలో ధాన్యం సేకరించిన తరువాత కొయ్యలకు నిప్పు పెట్టడంతో అధిక ఉష్ణోగ్రత వెలువడుతుంది. దీంతో పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా భూమిలో ఉండే నత్రజని, పాస్పరస్ లాంటి పోషక విలువల శాతం తగ్గి దిగుబడి తక్కువ వస్తుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కోల్పో తాయి. పంటకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. భూ మిలో ఉన్న సూక్ష్మ జీవులు, వానపాములు, జీవరాసులు చనిపోతాయి.

● వరి కొయ్యలతో కలిగే ప్రయోజనాలు..

వరి పంటను సేకరించిన పిదప కొయ్యలను నేలలో కలియ దున్నడంతో సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 10 శాతం వరకు పెరిగే అవ కాశం ఉటుంది. దుక్కిని దున్నే సమయంలో సిం గిల్ సూపర్ ఫాస్పెట్‌ను చల్లితే పక్షం రోజుల్లో కొయ్యలు మురిగి పోషకాలుగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉటుంది. దీంతో డీఏపీ వాడకం సగం వరకు తగ్గించి పెట్టుబడిని ఆదా చేసుకునేందుకు వీలుగా ఉంటుంది. కొయ్యలను కలియ దున్నితో ఒక ఎకర పొలంకు దాదాపుగా టన్ను వరకు ఎరువుతో పాటుగా మొక్కలకు 2 శాతం నత్రజని (యూ రియా) 4 శాతం ఫాస్పరస్ అదనంగా అం దుతుంది. మాంగనీస్, జింక్ కాల్షియం, ఇనుము వంటివి పంటకు ఎంతో మేలు చేకురుస్తాయి. భూ మిలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చి నీటి నిల్వ సామర్థ్యం పెరిగేం దుకు దోహదపడుతుంది.

> **ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది..**
> \- జిల్లా వ్యవసాయాధికారిణి అఫ్జల్ బేగం
>
> ప్రతి రోజు ఒక మండలం చొప్పున రైతులకు వరి కొయ్యలను తగలబెడుతే వచ్చే ప్రమాదాలు, తగ్గె దిగుబడులపై రైతులకు అవగహన కల్పిస్తున్నాం. దీంతో పాటుగా వాతావరణ కాలుష్యంతో పాటుగా రైతుల శ్వాసకోశ వ్యాధులకు గురికావడం, వరికొయ్యలకు నిప్పు అంటించడంతో అధిక మంటలు వ్యాపించి ప్రమాదాల బారిన పడిన సంఘటనలున్నాయి. రైతులు తప్పకుండా వ్యవసాయాధికారుల సలహాలు సూచనలను తప్పకుండా పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. వరికొయ్యలను దమ్ము చేసి మురగపెడితే దిగుబడి పెరుగుతుంది.

ఉమ్మడి జిల్లాలో నలుగురి బలవన్మరణం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ కారణాలతో ఉరివేసుకుని నలుగురు బలవన్మరణం చెందారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. వివరాల్లోకి వెళితే..

ఆర్థిక ఇబ్బందులతో మరమగ్గాల కార్మికుడి ఆత్మహత్య..



బోద శేఖర్(ఫైల్)

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణతో పాటు మరమగ్గాల పరిశ్రమ ఏర్పాటుకోసం చేసిన అప్పులు పెరిగి పోవడంతో వాటిని తీర్చేమార్గం లేక బోద శేఖర్(38) అనే మరమగ్గాల కార్మికుడు మంగళవారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన రాజన్నసిరిసిల్లకేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని జ్యోతినగర్‌కు చెందిన బోద శేఖర్ తనకున్న స్థలంలో అప్పులు చేసి మరమగ్గాల పరిశ్రమను ఏర్పాటుచేసుకున్నాడు. రెండు సంవత్సరాల క్రితం సంక్షోభం తలెత్తడంతో పనులు లేక మరమగ్గాల పరిశ్రమను బంద్ చేసి శేఖర్ మరో చోట మరమగ్గాల కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మరమగ్గాల పరిశ్రమల ఏర్పాటుతోపాటు కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు వడ్డీతో కలిపి రూ.40లక్షలవరకు పెరిగిపోవడంతో వాటిని తీర్చేమార్గం లేక మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శేఖర్‌కు భార్య లావణ్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ఇల్లంతకుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన కుమ్మరవేని లత (28) అనే వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. లత మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని మృతిచెందింది. మృతురాలికి 5 సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. మృతిచెందడానికి గల కారణాలు తెలియవలసి ఉంది. వివాహిత మృతిపై ఎస్సై సిరిసిల్ల అశోక్ మాట్లాడుతూ ఇంతవరకు ఎవరు ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

ఉరి వేసుకుని యువతి బలవన్మరణం

సుల్తానాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఎనగంటి రిక్విత(18) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎనగంటి శ్రీనివాసు-రజిత దంపతుల కూతురు ఎనగంటి రిక్విత కరీంనగర్ లోని ఓ హాస్టల్ ఉంటూ ఇంటర్ విద్య అభ్యసిస్తోంది. ఆరోగ్యం బాగా లేకపోవడంతో హాస్టల్ నుంచి వారంరోజుల కిందట ఇంటికి వచ్చింది. మంగళవారం హాస్టల్‌కు వెళ్లాల్సిఉండగా ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని కుటుంబసభ్యులు తెలిపారు. తల్లి రజిత ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని సుద్దాల నుంచి పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ఆస్పత్రికితరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి ఆత్మహత్య



విజ్ఞాన్(ఫైల్)

శంకరపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన ఓ విద్యార్థి ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం రాజాపూర్ గ్రామానికి చెందిన రెడ్డి విజ్ఞాన్ (21) ఉస్మానియా క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విభాగంలో మైనింగ్ డిపార్ట్‌మెంట్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం క్యాంపస్‌లోని ఆక్సిజన్ పార్కులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజ్ఞాన్ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మంగళవారం స్వగ్రామం రాజాపూర్ తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. విజ్ఞాన్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతికి సంబంధించి కారణాలు తెలియాల్సి ఉంది.

నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని దాడి..

● నలుగురిపై కేసు నమోదు

తంగళ్లపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని బెదిరింపులకు పాల్పడి దాడిచేసిన నలుగురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ ఉపేంద్రచారి తెలిపారు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ ఒకటవ వార్డుకు సుంకపాక శరత్ నామినేషన్ దాఖలు చేశాడు. నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని అదే గ్రామానికి చెందిన దేవచంద్రం, సాయి, కంకర రాజు, కంకర కిషన్ దాడిచేసి చంపుతామని బెదిరింపులకు పాల్ప డ్డారు. సుంకపాక శరత్ పెద్దనాన్న సుంకపాక దేవయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుమేరకు నలుగురిపై కేసునమోదు చేసుకునిదర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

జమ్మికుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాదిజమ్మికుంటలో అక్రమంగా నిల్వఉంచిన మద్యం బాటిళ్లను మంగళవారం పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. బోళ్ల శంకర్ అనేవ్యక్తి మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా పోలీస్‌లు పట్టుకున్నారు. అతడివద్దఉన్న రూ.5790విలువగల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణాగౌడ్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌గడ్డకు చెందిన ముస్తాఫా అనేవ్యక్తి గత ఫిబ్రవరి 25న తన సెల్‌ఫోన్‌ను బొమ్మకల్‌లో పోగొట్టుకోగా కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆ ఫోన్ వరంగల్‌లో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. ఆ సెల్‌ఫోన్‌ను కరీంనగర్ రూరల్‌సీఐ ఏ నిరంజన్‌రెడ్డి మంగళవారం యజమాని ముస్తాఫాకు అందజేశారు. ఫోన్ రికవరీకి కృషిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

కారు అదుపుతప్పి.. ప్రమాదం

● ఇద్దరి పరిస్థితి విషమం ● మరో ముగ్గురికి గాయాలు



పల్టీ కొట్టిన కారు



గాయపడ్డ బాలుడికి సీపీఆర్ చేస్తున్న స్థానికులు

తిమ్మాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌రహదారిపై ఓ కారు అదుపుతప్పి డివైడర్ పైనుంచి దూసుకువచ్చి అవతలివైపు వెళ్తున్న మరోకారుపై పడింది. ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ కట్టరాంపూర్‌కి చెందిన పెండ్యాల కిషన్‌రెడ్డి, ఆయన భార్య పెండ్యాల విజయ, కోడలు పెండ్యాల దివ్య, మనుమండ్లు అహన్(8), 2నెలల వయస్సుగల చిన్నబాబుతో కలిసి హైదా రాబాద్ నుంచి మంగళవారం కరీంనగర్‌కు వస్తున్నారు. తిమ్మాపూర్ మండలంలోని ఇందిరానగర్ చౌరస్తాకు సమీపంలో రాజీవ్ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ఉండటంతో అదుపు తప్పి రోడ్డు డివైడర్ పైనుంచి కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపువెళ్తున్న మరో కారుపైకి దూసుకెళ్లి రోడ్డు కిందికి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో కట్టరాంపూర్‌కి చెందిన ఒకే కుటుంబంలోని ఐదుగురికి గాయాలు కాగా అందులో ఇద్దరిపరిస్థితి విషమంగా ఉంది. మరో కారులో బెలూన్‌లు తెరుచుకోవడంతో బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్ఐ కలికోట సంతోష్‌కుమార్, టైపిస్ట్ తోడెలు రమేష్, బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న తాడగొండ కనుకయ్య స్వల్పగాయాలతో బయటపడ్డారు. సంఘటన స్థలానికి ఎల్‌ఎండీ పోలీసులు చేరుకొని క్షతగాత్రులను చికిత్సనిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బోయినపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో మంగళవారం జరిగింది. ఆదివారం గ్రామానికి చెందిన ఎడపల్లి అనురాగ్ (22) స్నేహితుడు పిట్టల అఖిల్ తో కలసి బోయినపల్లి నుంచి తడగొండ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. అఖిల్ ద్విచక్రవాహనాన్ని అజాగ్రత్తగా నడపడంతో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అనురాగ్, అఖిలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అనురాగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి రాజేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన అఖిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకాంత్ తెలిపారు.

కొండగట్టు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు దేవస్థానం కింద జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని టీపీఎఫ్‌జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య కోరారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కొండగట్టు అభయాంజనేయ స్వామి గుడి ఆవరణలో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 20షాపులు దగ్ధమైనాయని, బాధితులుసర్వం కోల్పోయారని, వారికి వెంటనే రూ.30లక్షల చొప్పున నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. ప్రమాదంలో పలువురు విద్యార్థుల సర్టిఫికెట్లు, పిల్లల పెళ్లికోసం దాచుకున్న డబ్బులు, బంగారం కాలి బూడిదగా మారాయని ఆవేదన చెందారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా ప్రధానకార్యదర్శి పులిపాక రవీందర్, జిల్లాఉపాధ్యక్షుడు గాండ్ల మల్లేశం, జిల్లాకార్యవర్గ సభ్యులు రాజు, సుధాకర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం నగునూర్‌గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నామని కరీంనగర్‌రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌డ్రైవర్ బాతుల వీరయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని తహసీల్దార్ ఎదుట హాజరుపరచి లక్షరూపాయల సొంతపూచీకత్తుపై బైండోవర్‌చేసినట్లు సీఐ తెలిపారు. మరికొందరు సస్పెక్ట్ షీటర్లను కూడా బైండోవర్ చేసినట్లు తెలిపారు.

మద్యం మత్తులో విగ్రహం ధ్వంసం

ఓదెల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీమరపల్లిలో సోమవారం రాత్రి ఓవ్యక్తి మద్యంమత్తులో భూలక్ష్మి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. రెండేళ్లక్రితం గ్రామస్థులు భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మద్యం మత్తులో ఓవ్యక్తి విగ్రహం ధ్వంసం చేశాడు. రెండునెలలక్రితం పొత్కపల్లిలోని పెద్దమ్మ ఆలయం ముందున్న పోతరాజు విగ్రహాన్ని మద్యం మత్తులో గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేశాడు. వరుస సంఘటనలతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీనగర్ కాలనీలో చోరీ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శ్రీనగర్ కాలనీలోని ఒక ఇంటిలో దొంగలు చొరబడి 8 గ్రాముల బంగారం ఎత్తుకుపోయారని బాధితులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఇంటికి తాళం వేసిన ఇంటి యజమాని హుస్నాబాద్‌కు వెళ్లి మంగళవారం ఉదయం వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా 8 గ్రాముల బంగారం కనపడకుండా పోయింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ కే సృజన్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులు, మహిళల భద్రతకు షీటీం ప్రత్యేక చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

జ్యోతినగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థుల భద్రతకు షీ టీం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని షీ టీం మెంబర్ స్నేహలత తెలిపారు. మంగళవారం ఎన్‌టీపీసీ, టీటీఎస్‌లోని సచిదేవా హైస్కూల్, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు చేపడు తున్న భద్రత చర్యలను వివరించి, ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే మొదట తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని, ఆ తర్వాత తమను సంప్రదించాలన్నారు. ఆపద సమయాల్లో డయల్ 100, అలాగే 6303923700కు ఫోన్ చేయాలన్నారు. మొబైల్ ఫోన్‌ద్వారా ఆన్‌లైన్ గేమ్స్, సైబర్ క్రైమ్‌లు పెరుగుతున్నాయని, వాటికి దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాను మంచి కోసం వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్‌కు మోసపోయిన వారు వెంటనే 1930 నెంబర్‌కు సమాచారం ఇస్తే వారు చర్యలు చేపడుతారన్నారు. మహిళల రక్షణకు షీటీం మెంబర్లు పలు రద్దీ ప్రాంతాలు, బస్టాండ్ల వద్ద నిఘా ఉంటుందని తెలిపారు. షీటీం సభ్యులు మౌనిక, సురేష్, ప్రిన్సిపాల్ జ్ఞాన్‌చంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్.. దొంగలు

● వరుస చోరీలతో భయం గుప్పిట్లో ప్రజలు



బొంతుపల్లిలో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)

వీణవంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బోరు మోటర్ల కేబుల్ వైర్ల చోరీలు పెరిగిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వీణవంక మండలంలోని బేతిగల్ కనపర్తి నర్సింగాపూర్, బొంతుపల్లి గ్రామాల్లో వ్యవసాయబోరు మోటార్ల కేబుల్‌వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కట్‌చేసి ఎత్తుకెళ్తున్నారు. పదుల సంఖ్యలో రైతుల మోటార్ల కేబుల్ వైర్లు ఎత్తుకెళ్తుండడంతో రైతులకు ఇబ్బందిగా మారింది. కొత్త కేబుల్ వైర్లు వేయాల్సి వస్తుండడంతో ఒక్కో రైతుకు నాలుగు నుంచి ఆరువేల ఖర్చు అవుతుండడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. వ్యవసాయ బావులవద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దొంగలు కాపర్‌తీగ ఎత్తెకెళ్తుండడంతో విద్యుత్ అధికారులకు, రైతులకు ఇబ్బందిగా మారింది. మరోవైపు ఇటీవల కనపర్తిలో ఓ ఇంట్లో బంగారం ఎత్తుకెళ్లారు. వీణవంక గ్రామశివారులో మేకలు మేపుతుండగా మేకను బైకుపై వచ్చి ఎత్తుకెళ్లారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉన్నా పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో దొంగలకు ఆసరాగా మారింది. వరుస దొంగతనాలతో మండల ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి వైర్ల దొంగలపై, ఇతర చోరీలపై ప్రత్యేక నిఘాఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి సేవిస్తున్నారని యువకులను.. అదుపులోకి తీసుకున్న పోలీసులు

జగిత్యాల టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో కొందరు యువకులు గంజాయి సేవిస్తున్నారనే సమాచారం మేరకు పట్టణ పోలీసులు పలువురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వివేకానంద స్టేడియంలో మంగళవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల క్రీడలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడే కూర్చొని ఉన్న కొందరు యువకులు ఏదో సేవిస్తున్నారు. వారి వైపునుంచి వస్తున్న పొగకు ఇబ్బంది పడ్డ ఉద్యోగులు కొందరు యువకులు గంజాయి సేవిస్తు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు అక్కడికి చేరుకొని ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకోగా మిగతావారు అక్కడి నుండి జారుకున్నారు. యువకులను పోలీస్ స్టేషన్ తరలించిన పోలీసులు విచారించి అది గంజాయి కాదని హుక్కా అని వదిలిపెట్టారు. అయితే అది హుక్కా కాదని గంజాయితో తయారు చేసిన హ్యాష్ అయిల్ అని సంక్షేమ శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు. దీనిపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు

● అదనపు కలెక్టర్ బీఎస్ లత ● ఘనంగా దివ్యాంగుల క్రీడాపోటీలు



క్రీడలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు ఆటలపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లత మాట్లాడుతూ దివ్యాంగుల సాధికారత, విద్య, ఉపాధి అవకాశాల విస్తరణ, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరిస్తూ, దివ్యాంగులు జీవితంలోని ప్రతిరంగంలో ప్రతిభను చాటగల సామర్థ్యం కలిగి ఉన్నారని, సమాజం వారికి ప్రోత్సహించేం దుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వసంక్షేమపథకాల సహకారంతో దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు జిల్లా పరిపాలన అన్నివిధాలుగా సహకరిస్తుందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి దివ్యాంగులు పెద్ద సంఖ్యలో హాజరై రన్నింగ్, షాట్‌పుట్, చెస్, జావెలిన్ త్రో, ఫీల్డ్ ఈవెంట్స్ వంటి వివిధ విభాగాల్లో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచినవారికి త్వరలోనే పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేయబడుతాయని జిల్లాసంక్షేమ అధికారి డాక్టర్‌నరేష్ తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, సాధికారత పరంగా జిల్లాలో మరిన్ని కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లాయువజన క్రీడలఅధికారి రవికుమార్, డీఈవో రాము, సీడీపీవోమమత, ఈవోపవిత్ర, సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్, ఫీల్డ్‌రెస్పాన్స్ అధికారులు కొండయ్య, డీసీపీవో హరీష్, ఎఫ్ఆర్‌వో కొండయ్య, మిషన్‌శక్తిసిబ్బంది, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో వైభవంగా గీతా జయంతి

● కన్నుల పండువగా పూర్ణాహుతి



పూర్ణాహుతి గావిస్తున్న వేదపండితులు

వేములవాడ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి దేవస్థానంలో గీతా జయంతి ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. శనివారం ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7-30 గంటలకు నాగిరెడ్డి మండపంలో మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, అర్చనలు, గీతా హోమంస్వామివారికి ఏకాంతంగా నిర్వహించారు. అనుబంధ ఆలయాల్లో శాస్త్రోక్త పద్ధతిలో ప్రత్యేకపూజలు, అర్చనలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా రాజన్నఆలయంలో ఉదయం 11-15గంటలకు పూర్ణాహుతి, కలశోద్వాసన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎల్ రమాదేవి పాల్గొన్నారు.


భీమన్న సన్నిధిలోని శిలా శాసనాల పరిశీలన



శాసనాన్ని పరిశీలిస్తున్న సాగర్

వేములవాడ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరాలయంలోని ప్రాచీన పురావస్తు విగ్రహాలు, డజన్‌కు పైగా ఉన్న శాసనాలను మంగళవారం కరీంనగర్ పురావస్తు శాఖ సహాయసంచాలకుడు ఎన్ సాగర్, స్థానిక చరిత్ర కారుడు సంకేపల్లి నాగేంద్ర శర్మ పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవోఎల్ రమాదేవిని కలిసి సైట్ మ్యూజియం ఏర్పాటుచేయాలని కోరారు. ఈ సందర్భంగా భీమేశ్వరాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయం గోడకు ఉన్న ప్రాచీనశాసనాన్ని, బాదామి చాళుక్యుల కాలం నాటి వినాయక విగ్రహాన్ని పరిశీలించారు.

వస్తే సర్పంచ్ పదవి.. పోతే ఎకరం..



పైసలుంటేనే పంచాయతీ బరిలో..

● భారీగా ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. డబ్బులు ఖర్చు పెట్టేవారినే సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో ఉంచేందుకు పార్టీల నాయకులు చర్చలు జరుపుతున్నారు. దీంతో ఖర్చు భరించే వారినే అభ్యర్థులుగా ఎంపిక చేసే యోచనలో ఉన్నారు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పోటీ చేయాలని ఉత్సాహం ఆసక్తి ఉన్న వారికి సైతం సరైన ఆర్థిక స్థోమత లేకపోతే అభ్యర్థులుగా అవకాశం కల్పించే పరిస్థితులు కనిపించడం లేదు. గ్రామానికి సేవ చేయాలనే తపన ఉన్నా డబ్బు లేకపోతే ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితులు లేవు. సామాజికవర్గం సమీకరణలు, ప్రజాదరణతో పాటు ఆర్థిక బలం ఉన్న వారిని అన్వేషిస్తున్నారు.

● జనరల్ స్థానాల్లో రూ. 10 లక్షల నుంచి రూ. 25 లక్షలు

జనరల్, బీసీ స్థానాల్లో పోటీ తీవ్రత అధికంగా ఉంది. ఎంత ఖర్చయినా కొందరు వెనుకాడడం లేదు. ఆశవాహులు తమ అభ్యర్థిత్వాలు ఖరారు కాకముందే గ్రామాల్లో ప్రతిరోజు వేలల్లో ఖర్చు చేస్తున్నారు. సమావేశాలు పెడుతూ తనకే మద్దతు ఇవ్వాలని కోరుతూ ఖర్చు పెడుతున్నారు. జనరల్ పంచాయతీల్లో 10 లక్షల నుంచి 25 లక్షలు ఖర్చు పెట్టే వారికి అవకాశం ఇవ్వాలని పార్టీల నాయకులు చూస్తున్నారు. ఆయకట్టు గ్రామాల్లో సర్పంచ్ పదవికి ఎక్కువ డిమాండ్ ఉంది. అక్కడ 50 లక్షల వరకు ఖర్చు పెట్టేందుకు పలువురు సిద్ధంగా ఉన్నారు. కొన్ని గ్రామాల్లో 25 లక్షల నుంచి 40 లక్షల వరకు ఖర్చు చేసేందుకు సిద్ధమే అంటున్నారు. వస్తే సర్పంచ్ పదవి పోతే ఎకరం భూమి అంటూ బరిలో నిలిచేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

● అయ్యగారూ.. ముహూర్తం చూడండి



గ్రామపంచాయతీ ఎన్నికల సంగ్రామంలో రెండో విడత నామినేషనర్ల పర్వం మంగళవారంతో ముగియనుంది. మూడో విడుతకు సంబంధించి బుధవారం నుంచి నామినేషన్లు ప్రారంభమవుతాయి. చివరి విడతలో ఉన్న ఆశావాహులు సెంటిమెంట్లకు పదునుపెట్టారు. సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీచేసే వారు తమ నామినేషన్లు ఏ శుభఘడియాల్లో వేయాలని ఆరా తీస్తూ పురోహితులను ఆశ్రయిస్తున్నారు. మూడో విడతలో ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నామినేషనర్ల పర్వ కొనసాగనుంది. అందులో 3వ తేదీ త్రయోదశితో పాటు బుధవారాన్ని శుభకరంగా భావిస్తారు. 4వ తేదీ దత్తాత్రేయ జయంతి ఉన్నా చతుర్ధశితో పాటు యుక్త పౌర్ణమితో అంతగా యోగ్యమైన ముహూర్తంగా భావించరు. 5వ తేదీ శుక్రవారంతో పాటు పాడ్యమి తిథి కావడంతో శుభముహర్తంగా పండితులు చెబుతున్నారు. దీంతో మూడో విడతలో చివరిరోజు నామినేషన్లు ఎక్కువ సంఖ్యలో వేసే అవకాశాలు ఉన్నాయి.

● పంచాయతీలకు ఆదాయాన్ని తెచ్చిన ఎన్నికలు

ఎన్నికలు పంచాయతీలకు కాసుల పంట కురుస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటి పన్ను చెల్లించి ఉండాలనే నిబంధన ఉంది. దీంతో పోటీ చేసే వారు పన్నులు చెల్లిస్తున్నారు. మూడోదశ నామినేషన్ల స్వీకరణ ఘట్టం ప్రారంభమవుతుండడంతో పలు గ్రామాల్లో ఇప్పటికే ఎన్నికల వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో వార్డు సభ్యులు, సర్పంచ్‌లుగా బరిలో నిలిచే అభ్యర్థులు తమ బకాయిలను పెండింగ్‌లో ఉంచుకోవద్దనే ఉద్దేశ్యంతో ఇంటి పన్నులు చెల్లిస్తున్నారు. దీంతో మొండి బకాయిల సమస్య తీరింది. ప్రతి ఏడాది మార్చిలోపు వసూళ్ల ప్రక్రియ ముగుస్తుంది. మరో నాలుగు నెలల ముందే బకాయిలు వసూళ్లు అవుతుండడంతో సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రేపు అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూ

గణేశ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల కరీంనగర్ లోని రసాయనశాస్త్ర విభాగంలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ బోధించుటకు గురువారం అతిధి అధ్యాపకులకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిం చనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్య ర్థులు తేదీ 4న ఉదయం 11 గంటలకు సర్టిఫి కెట్లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు రసాయన శాస్త్ర విభాగంలో సంప్రదించాలని తెలిపారు.

విదేశాల్లో విద్య, ఉద్యోగాలపై అవగాహన తరగతులు

గణేశ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని బీసీ, ఇతర విద్యార్థులకు విదేశాలలో ఉన్న అత్యున్నత విశ్వ విద్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశాలపై బీసీ స్టడీ సర్కిల్‌లో అవగాహన తరగతులు ప్రారంభిస్తున్నట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఎం.రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆసక్తి కలిగిన కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిఉన్న గ్రాడ్యుయేషన్ (ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్) ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు తేదీ 2-12-2025 నుంచి 21-12-2025 వరకు టీజీ బీసీస్టడీ సర్కిల్ వెబ్సైట్ "www.tgbc-studycircle.cgg.gov.in" ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్: 0878-2268686,040-24071178 సంప్రదించాలని కోరారు.

క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

● కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ● రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల విజేతలుగా వరంగల్, మహబూబ్‌నగర్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీరించాలని, నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. రాజన్న సిరిసిల్లజిల్లా కేంద్రం మినీ స్టేడియంలో జరుగుతున్న 8వ రాష్ట్రస్థాయి బాలబాలికల జూనియర్స్ వాలీబాల్ పోటీలు పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్‌పోటీల్లో బాలురవిభాగంలో వరంగల్-ఖమ్మం ఉమ్మడిజిల్లాలు, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ - వరంగల్ ఉమ్మడి జిల్లాల జట్లు తలపడ్డాయి. బాలురవిభాగంలో వరంగల్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, ఖమ్మం జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో, మహబూబ్‌నగర్ జిల్లాజట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ - వరంగల్ జట్లు తలపడగా, వరంగల్ జిల్లా ప్రథమ స్థానంలో, వరంగల్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో, నిజామాబాద్ జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. అనంతరం మినీ స్టేడియంలో ముఖ్య అతిథులు కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ వెల్మల స్వరూపతిరుపతిరెడ్డిలు విజేతలకు కప్‌లతోపాటు మెడల్స్ మెరిట్ సర్టిఫికెట్లను అందించి అభినందించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడారు. క్రీడాకారుడైన ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని అన్నారు. క్రీడలలో ప్రపంచ దేశాలతో మనం కూడా పోటీ పడుతున్నామని ఒలింపిక్స్‌లో తెలంగాణ బిడ్డలు పతకాలను తీసుకొస్తున్నారన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు శాప్ ఛైర్మన్ శివసేనారెడ్డిని తీసుకొచ్చి చూపించామని, త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందన్నారు. క్రీడాకారులు వ్యాయామం చేసుకోవాడనికి మినీ స్టేడియంలో జిమ్‌ను త్వరంలో ప్రారంభించుకోబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జెల రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ హన్మంతరెడ్డి, కోశాధికారి కృష్ణప్రసాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గిన్నె లక్ష్మణ్, రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ప్రధాన కార్యదర్శి అజ్మీరారాందాస్, ఉపాధ్యక్షులు చింతకింది శ్యాంకుమార్, సహాయ కార్యదర్శులు లక్ష్మణ్, రామస్వామి, కార్యనిర్వహణ కార్యదర్శి పిల్లి రాంచంద్రం గౌడ్, కోశాధికారి కోడం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు గుడ్ల రవి, రెఫరీ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ గణపతి, కన్వీర్ రవీందర్, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, వివిధ జిల్లాలో వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఫైనల్స్‌లో తలపడుతున్న మహబూబ్‌నగర్ - వరంగల్ బాలికల జట్లు

రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్‌గా దురిశెట్టి మనోహర్



కలెక్టర్ సత్యప్రసాద్‌కు పూలమొక్క అందిస్తున్న మేనేజర్ మనోహర్

జగిత్యాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెడ్కో ఉమ్మడిజిల్లా మేనేజర్‌గా ట్రాన్స్‌కో రిటైర్డ్ ఏడీఈ దురిశెట్టి మనోహర్‌ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల సంస్థ (రెడ్కో) ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్‌ను రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్ దురిశెట్టి మనోహర్ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఈసందర్భంగా మనోహర్ మాట్లాడుతూ హరిత ఇంధన ఉత్పత్తిలో పీఎం సూర్యఘర్, పీఎం-కుసుమ్, ఈవీ-చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, తదితర ప్రభుత్వ పథకాల అమలు, సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటు, వ్యవసాయ భూముల్లో రైతుల ప్రయివేటు సోలార్ ప్రాజెక్టుల స్థాపన, ప్రభుత్వ భవనాలపై సోలార్ పలకల ఏర్పాటు వంటి నిర్దేశించిన లక్ష్యాలను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేగవంతంగా సాధించాలన్న లక్ష్యంతో నియామకం చేశారన్నారు. తన నియామకానికి సహకరించిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెడ్కోచైర్మన్ డాక్టర్‌శరత్, ఎండీ అనిల తదితరులకు మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు.

పేర్ల మార్పు కోసం డీడీఎన్ అర్చకులకు ఇంటర్వ్యూలు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయకమిషనర్ కార్యాలయంలో మంగళవారం ధూపదీప నైవేద్య పథకం క్రింద గతంలో మంజూరీ అయిన ఆలయాలలో ఏర్పడ్డ పోస్టుల భర్తీలో భాగంగా పేర్లు మార్పు కోసం ఉమ్మడి జిల్లాకు చెందిన అర్చకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 3మెన్ కమిటీలో ఉమ్మడిజిల్లా సహాయకమిషనర్ నాయిని సుప్రియ పర్యవేక్షణలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, సంప్రదాయ పరంగా వేములవాడ, కొండగట్టు ఆంజనేయస్వామి, ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి సీనియర్‌అర్చకులు శరత్‌కుమార్‌శర్మ, చిరంజీవస్వామి, నంబి నరసింహస్వామి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా నియామకమైనవారు ఆయా ఆలయాల్లో డీడీఎన్ అర్చకులుగా విధులు నిర్వర్తించనున్నారు.

ఘనంగా దత్తాత్రేయ నవరాత్రి ఉత్సవాలు



దత్తాత్రేయ స్వామికి హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రామలింగేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయ స్వామి ఆలయంలో, గోదావరి నదీ తీరాన గల శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో స్వామి వారలను అందంగా పూలతో అలకంరణ చేసారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఒజ్జల సౌజన్యనరేందర్ పాల్గొన్నారు.

● మంత్రి పూజలు..

ధర్మపురి క్షేత్రంలోని దత్తాత్రేయ స్వామి సన్నిధిలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అర్చకులు కళొజ్జల శేఖర్ మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.

బద్ది పోచమ్మ సన్నిధిలో భక్తుల సందడి



బద్ది పోచమ్మకు బోనం సమర్పించేందుకు బారులు తీరిన భక్తులు



కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడలోని బద్దిపోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు సందడినెలకొంది. ముందురోజు భక్తులు భీమేశ్వరస్వామి దర్శనం చేసుకుని అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. పట్నాలు, కల్లు బెల్లంసాక, తదితర మొక్కులు చెల్లించారు. ఆలయానికి వచ్చినభక్తులతో ఈవో రమాదేవి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటిఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. పర్యవేక్షణలో ఏఈవో జి అశోక్‌కుమార్, పర్యవేక్షకుడు వెంకటప్రసాద్, ఎస్పీఎఫ్‌సిబ్బంది, ఆలయ ఉద్యోగులున్నారు.

కొండగట్టులో..

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం శనివారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

బాబోయ్ కుక్కలు..



గంభీరావుపేటలో కేజీ టూ పీజీ ప్రాంగణంలో కుక్కల గుంపు

గంభీరావుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేటలో వీధి కుక్కలు బెడద అధికమైంది. రోడ్లపై గుంపులు గుంపులుగా శునకాలు తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రోడ్లపై, కాలనీల్లో, స్కూళ్లవద్ద కుక్కల బెడద వెంటాడుతోంది. ద్విచక్ర వాహనదారులపైకి ఒక్కసారిగా దూసుకు వస్తుండటంతో రోడ్డు ప్రమాదానికి గురై గాయాల పాలవుతున్నారు. పిల్లలను బడులకు, సమీప దుకాణాలకు పంపాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వందల సంఖ్యలో ప్రజలు కుక్క కాటుకు గురైన వారు ఉన్నారు. అప్పట్లో లక్ష్మీపూర్ గ్రామ సమీపాన కుక్కలు వెంబడించడంతో ఓ వ్యక్తిబైక్‌పై నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పటికైనా కుక్కల బారినుంచి తమను రక్షించాలని స్థానికులు కోరారు.

వీధి కుక్కల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పలుకాలనీల్లో దాడులకు దిగుతుండటంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ రాంనగర్ ప్రాంతంలో 4రోజుల క్రితం వెంకట రమణారావు అనే వ్యాపారిపై కుక్కలు దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. అతడు ప్రస్తుతం ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడని టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి తెలిపారు. రాంనగర్ నుంచి సంతోష్‌నగర్ వైపు బైక్‌పై వెళుతున్న రమణారావును ఒక ప్రైవేట్ స్కూల్ వద్ద రోడ్డుపై వీధికుక్కలు వెంటపడటంతో అతను తప్పించుకునే ప్రయత్నంలో కిందపడటంతో తలకు తీవ్రగాయాలై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే గమనించిన స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. బార్‌యజమాని అయిన వెంకట రమణారావు ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఈ నెల 13, 24 తేదీల్లో శబరిమలకు రెండు ప్రత్యేక రైళ్లు

పెద్దపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ఈనెల, వచ్చేనెలలో దక్షిణమధ్య రైల్వే ప్రత్యేకరైళ్లను నడుపుతోంది. అందులో భాగంగా ఈనెల13,24తేదీల్లో నడవనున్న రైళ్లకు పెద్దపల్లి రైల్వేజంక్షన్‌లో హాల్టింగ్ కల్పించారు. ఈనెల 13న ఉదయం రైలు నంబర్ 07117 సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఉదయం 10గంటలకు కొల్లాం వరకు బయలుదేరనున్నది. ఈరైలు బెల్లంపల్లి, మంచిర్యాలమీదుగా రామగుండంకు ఉదయం11:18 గంటలకు చేరుకోనున్నది. పెద్దపల్లిజంక్షన్‌కు 11:38గంటలకు, జమ్మికుంటకుమధ్యాహ్నం 12:20గంటలకు చేరుకోనున్నది. వరంగల్, విజయవాడ, గూడూరు, తిరుపతి,కాట్పాడి,ఈరోడ్, కోయంబత్తూర్, పాలక్కాడ్, ఎర్నాకుళం, కొట్టాయం మీదుగా కొల్లాంకు మరుసటి రోజురాత్రి 7గంటలకు చేరుకోనున్నది. అలాగేఈనెల24న తెల్లవారుజామున 4:25గంటలకు నాందేడ్‌లో బయలు దేరి మరుసటిరోజు రాత్రి 10గంటలకు కొల్లాం చేరుకోనున్నది. ఈరైలు నిజామాబాద్, ఆర్మూర్, కోరుట్ల,జగిత్యాల,కరీంనగర్,పెద్దపల్లి, జమ్మికుంట,వరంగల్ మీదుగా శబరిమలచేరుకోనున్నది. కరీంనగర్‌కు ఉదయం10గంటలకు, పెద్దపల్లికిఉదయం 10:50గంటలకు, జమ్మికుంటకు ఉదయం మధ్యాహ్నం 12:20 గంటలకు చేరుకోనున్నది.

ట్రాన్స్‌ఫార్మర్‌ను గద్దెపై ఏర్పాటు చేయరూ..



రోడ్డుకు సమానంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ముత్తారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లేమార్గంలో విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ మార్గంలో రోడ్డుపక్కన ట్రాన్స్‌ఫార్మర్ కోసం గద్దె నిర్మించి ఏళ్లుగడుస్తున్నా ఇప్పటికీ అక్క డ ట్రాన్స్‌ఫార్మర్ బిగించలేదు. అయితే అక్కడున్న ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు సమానంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఈట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలో జూనియర్ కళాశాల ఉండటంతో నిత్యం ఈరోడ్డుగుండా చాలామంది రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాకుండా ఈ రోడ్డు పారుపల్లి గ్రామానికి వెళ్లేమార్గం కావడంతో నిత్యం చాలా మంది ప్రయాణిస్తుంటారు. ఏదైనా వాహనం అదుపుతప్పితే నేరుగా ట్రాన్స్‌ఫార్మర్‌కు ఢీ కొట్టే పరిస్థితులున్నాయి. అంతేగా కుండా పశువులు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనున్న గడ్డి మేసేందుకు వెళ్తే విద్యుత్‌షాక్‌కు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి హైలెవల్ గద్దెపై ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాట చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రూ.7,250 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో బుధవారం క్వింటాల్ పత్తి ధర రూ.7,250 పలికింది. మంగళవారం మార్కెట్‌యార్డుకు 58మంది రైతులు 366క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,250, కనిష్ఠ ధర రూ.6,500 చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు.



పత్తి వేలం పాట నిర్వహిస్తున్న వ్యాపారులు

పది గ్రామ పంచాయతీల్లో 8 తండాలే..

- రుద్రంగి మండలంలో అత్యధికంగా గిరిజన పంచాయతీలు



బడితండా గ్రామం

రుద్రంగి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అత్యధికంగా గిరిజన తండాలు పంచాయతీలుగా ఉన్న మండలం రుద్రంగి. మండలంలో 10 గ్రామ పంచాయతీ ఉండగా, అందులో 8 గిరిజన తండాల పంచాయతీలే. జిల్లాల పునర్విభజనలో భాగంగా 2016 అక్టోబరులో చందుర్తి మండలం నుంచి కొత్తగా రుద్రంగి మండలాన్ని ఏర్పాటు చేశారు. మొదట రుద్రంగి, మానా ల రెండు గ్రామపంచాయతీలతో ఏర్పడిన ఈ మండలంలో 16 గిరిజన తండాలను జీపీలు చేయడంతో మరో 8 గ్రామ పంచాయతీలు పెరిగాయి. మొత్తంగా రుద్రంగి మండలంలో 10 గ్రామపంచాయతీలుగా ఉన్నాయి. ఇందులో అడ్డబోరుతండా, బడితండా, చింతమణి తండా, దేగవత్ తండా, గైదిగుట్ట తండా, రూప్లా నాయక్ తండా, సర్పంచ్ తండా, వీరుణితండాలు గ్రామపంచాయతీలుగా ఉన్నాయి. ఈ మండలంలో ఎస్టీ జనాభా పురుషులు 1823, మహిళలు 1845, మొత్తం 3668 మంది జనాభా ఉన్నారు. అలాగే ఎస్టీ ఓటర్లు పురుషులు 1580, మహిళలు 1621 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం ఈ తండా పంచాయతీల్లో మూడు గ్రామాలు చింతమణితండా, రుప్లానాయక్‌తండా, వీరునితండా గ్రామాలు సర్పంచ్, వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి.

విద్యార్థులకు నిఘంటువుల అందజేత

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రాణహిత ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిఘంటువులు, జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం తానా అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మనోహరాచారి, సభ్యుడు దేవిరెడ్డి, నాగేంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు నామినేషన్లు స్వీకరించాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం క్లస్టర్ కేంద్రాల్లో కేటాయించిన గ్రామాలకు సంబంధించి పోటీ చేసే వారి నుంచి నామినేషన్లను స్వీకరించాలని ఎంపీడీవో శ్రీలేఖ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు మద్దిమల్లలో ఏర్పాటు చేసిన కేంద్రాలను మంగళవారం ఆమె సందర్శించారు. సౌకర్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

కులసంఘాల మచ్చిక కోసం ప్రయత్నాలు

ఇల్లంతకుంట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో కుల సంఘాలను మచ్చిక చేసుకోవడానికి నాయకులు ప్రయత్నిస్తున్నారు. మండలంలోని ఓ గ్రామంలో ఎక్కువ ఓట్లు ఉన్న సంఘ సమావేశం జరిగింది. సర్పంచ్‌లుగా పోటీచేసే అభ్యర్థుల మద్దతుదారులు బేరం ప్రారంభించారు. ఇదే గ్రామంలో మరో కులసంఘానికి సైతం ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘసభ్యులను పిలిచి ఓటహక్కును సద్వినియోగం చేసుకోవాలని, ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. మరో గ్రామంలో గ్రామస్థులకు అవసరమైన స్థలాన్ని కొనుగోలు చేయిస్తాని ఇరువురు అభ్యర్థులు హామీ ఇచ్చారు.

కరపత్రం ఆవిష్కరణ

ఇల్లంతకుంట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో మంగళవారం మహాధర్నా కరపత్రాన్ని టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు మారుపాక అనీల్‌కుమార్ ఆవిష్కరించారు. ఈనెల 3న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

● వేములవాడ : జర్నలిస్టుల న్యాయపరమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో తలపెట్టిన జర్నలిస్టుల ధర్నా కరపత్రాలను వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం ఎన్నెన్నో పాట్లు..

- హామీలు గుప్పిస్తున్న సర్పంచ్ అభ్యర్థులు

ఇల్లంతకుంట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేస్తున్న సర్పంచ్ అభ్యర్థులు హామీలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండలకేంద్రంలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మామిడి రాజు పుట్టిన ప్రతి ఆడబిడ్డకు రూ 5వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని, చనిపోయిన ప్రతి కుటుంబానికి రూ 10వేలు అందజేస్తానని హామీ ఇచ్చారు. నర్సక్కపేట గ్రామంలో పోటీచేస్తున్న మరో అభ్యర్థి ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యానికి తోడు మరో 10కిలోల బియ్యాన్ని అందిస్తానని హామీ ఇచ్చాడు. సోమారంపేట గ్రామానికి చెందిన అభ్యర్థి శుభ, అశుభ కార్యక్రమాలకు టెంటు ఉచితంగా వేస్తానని ప్రజల ముందు హామీ ఇచ్చాడు. వీరే కాక మరికొంత మంది హామీల వరదలు పారిస్తున్నారు.

నేటి నుంచి దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు

బోయినపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వరదవెల్లి దత్తాత్రేయ స్వామి గుట్టపై జయంతి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు ఆలయంలో దత్త జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు పర్యటక శాఖ ఆధ్వర్యంలో బోట్ సౌకర్యం కల్పించారు.

పార్టీల్లో ఎక్కువైన రెబల్స్ బెడద..

కోనరావుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలంలో స్థానిక సంస్థలు ఎన్నికల్లో ఒకే పార్టీ నుంచి ఇద్దరు లేదా ముగ్గురు పోటీ చేయడం వల్ల ఆయా పార్టీలకు అభ్యర్థులు తలనొప్పిగా మారారు. కోనరావుపేట మండలంలో పలు గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలో రెబల్స్ బెడద ఎక్కువైంది. వారిని బుజ్జగించి ఒకరిని నియమించాలని పార్టీ పెద్దలు ప్రయత్నిస్తున్నారు. సుద్దాలలో బీఆర్ఎస్ నుంచి కచ్చకాయల మహేష్, కుంటెల్లి నాగరాజు, ఉప్పుల అంజయ్య సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. బావుసాయిపేటలో కాంగ్రెస్ నుంచి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నందుగౌడ్ పోటీ పడుతున్నారు. అంతేకాకుండా పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొనడంతో వారిని బుజ్జగించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఉపసంహరణ గడువు మూడో తేదీ వరకు ఉండడంతో అభ్యర్థులు వారి వారి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

నియామక పత్రం అందజేత



నియామక పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియామకమైన సంగీతం శ్రీనివాస్ మంగళవారం హైదారాబాద్‌లో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందించారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు.

సారూ.. గుంత పూడ్చరూ..



ప్రమాదకరంగా మారిన గుంత

వేములవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని మల్లారం రోడ్డులో మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోందని గతనెల 18న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పైప్‌లైన్ మరమ్మతు చేపట్టి గుంతను సరిగ్గా పూడ్చకుండా వదిలేశారు. దీంతో కాలనీవాసులు, వాహనదారులు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే గుంతను పూడ్చివేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థినికి అభినందనలు..



జీవనజ్యోతిని అభినందిస్తున్న పాఠశాల టీచర్లు

వేములవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన జీవనజ్యోతి అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థిని జీవనజ్యోతి ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు సుధారాణి తదితరులు అభినందించారు.

రోడ్డుపై పొంచి ఉన్న ప్రమాదం..



గంభీరావుపేట-లింగన్నపేట రోడ్డుపై ఉన్న గుంత

గంభీరావుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట-లింగన్నపేట ప్రధాన రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత ప్రయాణికులను ఆందోళన కలిగిస్తోంది. కామారెడ్డి-సిద్దిపేట ప్రధాన రహదారి ఇదే కావడంతో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఈ మార్గంలోని కల్వర్టు వద్ద ప్రమాదకర గుంత ఉండటంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని వాహనదారులు కోరుతున్నారు.

నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఇన్‌చార్జి కలెక్టర్



నామినేషన్ల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

బోయినపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు. బోయినపల్లిలోని ఆర్‌ఓ కేంద్రంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను తనిఖీ చేశారు. నామినేషన్‌తో పాటు అభ్యర్థి నూతన బ్యాంక్ ఖాతా కచ్చితంగా ఉండాలని, అన్ని వివరాలు నింపాలని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించిన తరువాత వారితో ఎన్నికల నియమావళి, వ్యయం వివరాల అందజేతపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం హెల్ప్ డెస్క్ పరిశీలించి, అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. బోయినపల్లి జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని తనిఖీ చేసి, చేయాల్సిన ఏర్పాట్లపై ఎంపీడీఓకు సూచనలు చేశారు.

లారీలు అందుబాటులో ఉండాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అవసరమైన మేర లారీలు అందుబాటులో ఉండాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బోయినపల్లి మండల కేంద్రంలోని ఏఎంసీ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతం, తూకం తనిఖీ చేశారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ గరిమఅగ్రవాల్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన టార్పాలిన్, వసతులు కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే సమీప రైస్ మిల్లులకు తరలించాలని, ట్యాబ్‌ఎంట్రీ వేగంగా పూర్తిచేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం నిలువలకు అనుగుణంగా లారీలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీవో రాధాబాయి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చంద్ర ప్రకాశ్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగంప తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో జయశీలలు పాల్గొన్నారు

ముగిసిన రెండో విడత నామినేషన్ల పర్వం



నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మీనారాయణ

తంగళ్లపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలో 30 గ్రామ పంచాయతీల సర్పంచ్ పదవులకు 252 గ్రామ పంచాయతీ వార్డుల నామినేషన్ల పర్వం ముగిసింది.మంగళవారం కస్బెకట్కూర్, మండేపల్లి నామినేషన్ కేంద్రాలను ఎంపీడీవో లక్ష్మీనారయణ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తంగళ్లపల్లి గ్రామ పంచాయతీ ఒకట వార్డుకు నామినేషన్ వేయడానికి 5నిమిషాలు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థిని పోలీసులు కేంద్రంలోకి అనుమతించ లేదు. అలాగే మండలంలో వేణుగోపాల్‌పూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి, ఆరు వార్డులకు సింగిల్ నామినేషన్ దాఖలు అయ్యాయి. బాలమల్లుపల్లె గ్రామం సర్పంచ్ పదవికి, ఆరు వార్డులకు సింగిల్ నామినేషన్ దాఖలు అయ్యాయి.

● ఇల్లంతకుంట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. మంగళవారం రోజున 35 సర్పంచ్ స్థానాలకు 90మంది అభ్యర్థులు, 294వార్డుసభ్యుల స్థానాలకు 375మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు అసిస్టెంట్ డిస్ట్రిక్ ఎన్నికల అథారిటీ శశికళ పేర్కొన్నారు. మూడు రోజులలో సర్పంచ్ స్థానాలకు 195 మంది, వార్డుసభ్యుల స్థానాలకు 656మంది నామినేషన్లు వేశారు. పెద్దలింగాపూర్, ముస్కానిపేట క్లస్టర్ నామినేషన్ కేంద్రాలలో రాత్రి వరకు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. చివరి రోజు అభ్యర్థులు గ్రామాలలో భారీ ర్యాలీ తీసి నామినేషన్లు దాఖలు చేశారు. ఎస్సై సిరిసిల్ల అశోక్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు.

ప్రచారానికి గడువు వారమే..

- నేడు గుర్తుల కేటాయింపు..
- చందుర్తి మండలంలో 28094 మంది ఓటర్లు

చందుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొదటివిడత నామినేషన్ల పర్వం ముగిసింది. అభ్యర్థుల విత్‌డ్రాలు బుధవారంతో ముగియనుంది. ఇంకా ఎన్నికల గుర్తులు కేటాయింపుతో పల్లె రాజకీయం వేడెక్కనుంది. సర్పంచు పింక్ రంగు బ్యాలెట్ పేపరు, వార్డు సభ్యుడికి తెలుపు రంగు బ్యాలెట్ పేపరును ఎన్నికల సంఘం కేటాయించింది. సర్పంచు 30 రకాలు, వార్డు సభ్యుడికి 30 రకాల గుర్తులు కేటాయించారు.ఈనెల 3వ తేదీన విత్‌డ్రా తర్వాత సాయంత్రం ఫైనల్ లిస్టును ఆర్వోలు ప్రకటించిన తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. తెలుగు అక్షర క్రమంలో గుర్తులను అభ్యర్థులకు కేటాయిస్తారు. మండలంలో 19 గ్రామపంచాయతీలు ఉన్నాయి.

బ్యాలెట్ బాక్సులు మూడు రకాలు..

చందుర్తి మండలంలో 19 గ్రామపంచాయతీ ఎన్నికల్లో 163 నుంచి మొదలుకుని 3454 వరకు ఓట్లు ఉన్నాయి. ప్రతీ గ్రామంలో 4 నుంచి 12 వార్డులున్నాయి. ఒక్క వార్డుకు ఒక్కో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. వార్డు ఓటర్ల ఆధారంగా మూడుర కాల బ్యాలెట్ బాక్సులను ఏర్పాటు చేస్తున్నారు. అందులో స్మాల్, మీడియం, లార్జ్ జంబో బాక్సులను ఏర్పాటు చేస్తున్నారు. అందులో 100 ఓట్లు పట్టే బాక్సు 200 ఓటర్లు పట్టే బాక్సు, 1000 ఓట్లకు పైగా పట్టే బాక్సులను జంబో బాక్సులుగా ఏర్పాటు చేయనున్నారు. చిన్న రకాల బ్యాలెట్ బాక్సుల్లో వంద ఓట్ల వరకు పడతాయి. ఒకే బ్యాలెట్ బాక్స్‌లో సర్పంచ్, వార్డు సభ్యుడిని ఎన్నుకోవడానికి రెండు ఓట్లు ఉంటాయి. 50 మంది కంటే తక్కువ ఓటర్లు ఉన్న వార్డుల్లో ఈ చిన్న రకాల బ్యాలెట్ బాక్సులను ఉపయోగిస్తారు. 50 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న వార్డులకు ఈ మధ్య రకం బ్యాలెట్ బాక్సులను వినియోగిస్తారు. 200 వరకు ఓట్లు వేయవచ్చు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్నవార్డుల్లో పెద్ద బ్యాలెట్ బాక్సులను ఏర్పాటు చేస్తారు. మూడువేల మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న గ్రామపంచాయతీల్లో పెద్ద బ్యాలెట్ బాక్సులను అందుబాటులో ఉంచుతారు.

చందుర్తి మండలంలో 13445 మంది పురుషుల 14649 మహిళాల ఓటర్ల మొత్తం 28094 మంది ఓటర్లు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలి



చందుర్తిలో మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్



మల్కపేటలో మాట్లాడుతున్న ఎస్సై ప్రశాంత్‌రెడ్డి

చందుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చందుర్తి ఎస్ఐ రమేష్ కోరారు. చందుర్తి మండల కేంద్రం, ఎనగల్, బండపల్లి గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఎన్నికల దృష్ట్యా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా పోటీచేసే అభ్యర్థులు, నాయకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. నాయకులు గానీ, అభ్యర్థులు గానీ ఓటర్లను ఓట్లను మాత్రమే కోరాలని, ఎలాంటి బెదిరింపులకు ప్రలోభాలకు పాల్పడడం గురి చేయవద్దని సూచించారు. ఎన్నికల్లో ఎవరైనా ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తప్పవని ఎన్నికల నిబంధనలు కఠినంగా ఉంటాయని అందరూ తెలుసుకోవాలన్నారు. మీ గ్రామాల్లో మీకు నచ్చిన నాయకుడిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకుంటే గ్రామాలు సమస్యలు లేకుండా ఉంటామని అభివృద్ధి పథంలో ముందుకెళ్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● కోనరావుపేట : స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామాల్లో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కోరారు. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో ఎన్నికల నియమావళిపై కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగం, ఎన్నికల సమయంలో ప్రవర్తించాల్సిన తీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రజలు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గంభీరావుపేట గాంధీచౌక్ వద్ద మంగళవారం రాత్రి ప్రజలతో సీఐ మాట్లాడుతూ పంచాయతీ నామినేషన్లు మొదలుకొని పోలింగ్ వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని వివరించారు. నామినేషన్ కేంద్రాలతో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద 146 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలోకి వెళ్లే సమయంలో లోనికి సెల్‌ఫోన్ తీసుకెళ్లొద్దని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. వెంట ఎస్ఐ అనిల్‌కుమార్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలంలోని గ్రామాల్లో జరుగనున్న స్థానిక ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు తమకు సహకరించాలని ఎస్ఐ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. పల్లెలో మద్యం అనుబంధ దుకాణాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం నిల్వలు, అమ్మకాలు సాగించకూడదని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని అన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏమైనా సమస్యలుంటే 100 లేదా ఎస్‌హెచ్‌వో నంబరు 8712656376కు సమాచారం అందించాలని ఎస్ఐ లక్ష్మణ్ కోరారు.

తుది విడతకు రంగం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

మహిళలు 45, జనర ల్ 83 స్థానాలు, గంభీరావుపేటలో మహిళలు 10, జనరల్ 12 స్థానాలు ఉన్నాయి. వార్డుల్లో మహిళలు 89, జనరల్ 113 స్థానాలు కేటాయించారు.

తుది విడతలో 1,27,920 మంది ఓటర్లు

జిల్లాలో 353351 మంది ఓటర్లు ఉండగా, మొదటి విడత ఎన్నికల్లో 114282 మంది ఓటు హక్కు విని యోగించుకోనున్నారు. రెండో విడతలో 111129 మంది ఓటు వేయనున్నారు. ఇందులో 53792 మంది పురుషులు, 57337 మంది మహిళలు ఉన్నారు. మూడో విడతలో 127920 మంది ఓటు వేయనున్నారు. ఇందులో 61928 మంది పురుషులు, 65992 మంది మహిళలు ఉన్నారు.

బెల్ట్ షాపులను మూసివేయాలి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బెల్ట్ షాపులను మూసివేయాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశర్థం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం శాంతినగర్ ఏఐఎఫ్‌టీయూ (న్యూ) పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం(బీఆర్ఎస్) మాదిరిగా కాకుండా మద్యం అమ్మకాలపై నియంత్రణ ఉండాలన్నారు. నిబంధనలను అతిక్రమించి వైన్స్‌లకు సంబంధించిన పర్మిట్‌రూంల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ విచ్చలవిడిగా వైన్స్‌లకు అనుమతులు ఇవ్వడంతో వైన్స్ యజమానులు గ్రామాలలో బెల్ట్‌షాపులను ప్రోత్సహించారని, దీంతో తెలంగాణ తాగుబోతుల రాష్ట్రంగా మారిందని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనాలను అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు గుజ్జ దేవదాస్, అకిన సత్తయ్య, ద్యానపల్లి ఎల్లయ్య, రాజేశం పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలం దెగవాత్ తండా గ్రామంలోని బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన సూమారు 30 మంది నాయకులు మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెలుకల తిరుపతి, కునుసోత్ బీరయ్య, గుగులోత్ బాలు, రాజు, తిరుపతి, బీమ, గజన్, విజయ్ పాల్గొన్నారు.

● చందుర్తి డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం సనుగుల మాజీ సర్పంచ్‌తో పాటు, దెవుని తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. వారిలో మాజీ సర్పంచ్ లకావత్ శత్రులాల్, నాయకులు గుగులోత్ రమేష్, రూప్ సింగ్, నరేష్‌లు ఉన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, ముకుందరెడ్డి, పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్లు షురూ..

- ఎల్లారెడ్డిపేటలో 10, వీర్నపల్లిలో 4 క్లస్టర్ కేంద్రాలు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మూడో విడత నామినేషన్ల స్వీకరణ ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో బుధవారం నుంచి ప్రారంభం కానుంది. అందుకు సంబంధించి ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలాల్లోని రెండు నుంచి ఐదు గ్రామ పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్ కేంద్రం ఏర్పాటు చేశారు. కేంద్రంలోనే నామినేషన్లను స్వీకరించనున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని 26 గ్రామ పంచాయతీలు, 226 వార్డులు, వీర్నపల్లి మండలంలో 17 గ్రామ పంచాయతీలు, 132 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నెల 3 నుంచి 5 వ తేదీ వరకు గ్రామాల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను క్లస్టర్ కేంద్రాల్లో దాఖలు చేయాలని ఎంపీడీవోలు సత్తయ్య, శ్రీలేఖలు కోరారు. క్లస్టర్ కేంద్రాలు, పంచాయతీల వివరాలను వారు వెల్లడించారు.

● ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ నామినేషన్ కేంద్రంలో వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి, అగ్రహారం, హరిదాస్‌నగర్ కేంద్రంలో హరిదాస్‌నగర్, పదిర, నారాయణపూర్ కేంద్రంలో నారాయణపూర్, రాగట్లపల్లి, బండలింగంపల్లి కేంద్రంలో బండలింగంపల్లి, సింగారం, బొప్పాపూర్‌లో బొప్పాపూర్, కోరుట్లపేట, గొల్లపల్లిలో గొల్లపల్లి, దేవునిగుట్టతండా, తిమ్మాపూర్‌లో తిమ్మాపూర్, బాకురుపల్లితండా, గుండారం, జై సేవాలాల్ తండా, రాచర్లబాకురుపల్లి, రాజన్నపేటలో రాజన్నపేట, అల్మాస్‌పూర్, గుంటపల్లిచెరువుతండా, కిష్టునాయక్‌తండా, దుమాలలో దుమాల, అక్కపల్లి, బుగ్గరాజేశ్వరతండా, ఎల్లారెడ్డిపేటలో ఎల్లారెడ్డిపేట గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేయాలని ఎంపీడీవో సత్తయ్య పేర్కొన్నారు.

● వీర్నపల్లి మండలంలోని వీర్నపల్లి నామినేషన్ కేంద్రంలో వీర్నపల్లి, కంచర్ల, బావుసింగ్‌నాయక్‌తండా, భూక్యతండా,మద్దిమల్లలో బాబాయిచెరువుతండా, బంజేరు, మద్దిమల్ల, మద్దిమల్లతండా, రంగంపేటలో ఎర్రగడ్డతండా, రంగంపేట, అడవిపదిర,లాల్‌సింగ్‌తండా, గర్జనపల్లిలో గర్జనపల్లి, సీతారాంనాయక్‌తండా, జవహర్‌లాల్‌నాయక్ తండా, శాంతినగర్, వన్‌పల్లి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాలని ఎంపీడీవో శ్రీలేఖ కోరారు.

అధికారుల తీరుపై విమర్శలు..

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ఎక్సైజ్ అధికారులు వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తోంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. రాచర్లబొప్పాపూర్ గ్రామంలోని యువకులు మంగళవారం రాత్రి 12 బీర్లు, 4 టిన్లను బైక్‌పై తరలిస్తున్న క్రమంలో ఎక్సైజ్ అధికారులు వెంబడించి పట్టుకున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున్న మద్యం తరలించకూడదని పేర్కొంటూ హెచ్చరించారు. ఇంటిలో శుభకార్యం ఉందని చెప్పడంతో ఆరు బీరు సీసాలను అప్పగించి, 6 బీర్లతో పాటు 4 టిన్లను తీసుకెళ్లారు. యువకులు ఆదేశాఖలోని ఓ అధికారికి విషయం చెప్పడంతో మద్యం తిరిగి ఇచ్చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. నలుగురు కానిస్టేబుళ్లు 4 బీరు సీసాలను దాచుకుని 2 బీర్లతో పాటు 4 టిన్లను అప్పగించడంపై యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా విచారణ జరిపి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని వివరించారు.